

వానొస్తే టార్పాలిన్ కప్పాల్సిందే..



"మాకు ముందు నుంచే జాగ లేదు. కనీసం ఉండడానికి ఇల్లు కూడా లేదు. మా పెళ్లయ్యి పదిహేండ్లు అవుతుంది. అప్పటి నుంచి ఈ గుడిసె లోనే ఉంటున్నాం. ఇక మా అత్త, మామ చెట్టు కింద మంచం వేసుకుని పడుకుంటరు. వానొస్తే గుడిసె మీద టార్పాలిన్ కవర్ కప్పాల్సిందే. పురుగు, పుట్రతో భయపడుతున్న మా ఇద్దరు పిల్లలతో పడుకుందా మన్న కాళ్లు చాపుకునేందుకు గుడిసెలో జాగ కూడా సరిపోవడం లేదు. మా అత్తమామ డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయారు. మేం కూడా దరఖాస్తు చేసుకున్నాం. ఈసారైనా ఇందిరమ్మ ఇల్లు ఇస్తారన్న ఆశతో ఉన్నాం."

- జెల్ల చంద్రకళ, అచ్చుమాయిపల్లి, దుబ్బాక మండలం

ఇల్లు లేక కొడుకు, కోడలు పట్నం పోయింద్రు

"మాకు గుంట జాగ కూడా లేదు. ఇల్లు లేదని కొడుకు, కోడలు సుతారి పని కోసం పట్నం పోయింద్రు. వాళ్ల ఇక్కడి వస్తే ఉండడా నికి కనీసం జాగ లేదు. ఇద్దరు పిల్లలు మా దగ్గరే ఉంటున్నరు. నా భర్తకు కాలిరిగింది. ఆయన మూత్రానికి పోవాలన్న, బాత్‌రూంకు పోవాలన్న మరుగుదొడ్డి లేదు బయటకు పోవాల్సిందే. మా పాలోళ్లను బతిలాడి వాళ్ల జాగలో గుడిసె వేసుకుని ఉంటున్నం. ఏ రోజైనా వారు ఖాళీ చేయంటే ఇంకో జాగ వెతుక్కోక తప్పదు. మాకు ఎవరు వచ్చినా (పాలకులు) లాభంలేదు. మా బతుకులు మారవు. ఇల్లు కట్టుకునే భాగ్యం రాదు."

- సోమారపు ఎల్లవ్వ, అచ్చుమాయిపల్లి, దుబ్బాక మండలం



డబ్బు పోగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలి

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 1 : సిద్దిపేట జిల్లాలో సైబర్ నేర స్థుల వలలో పడి రూ.లక్ష లోపు డబ్బు పోగొట్టుకున్న బాధితులు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లోని సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చని సీపీ డాక్టర్ అను రాధ ప్రకటనలో తెలిపారు. లక్ష నుంచి, ఆపైన డబ్బు పోగొట్టుకున్న బాధితులు వెంటనే జాతీయ సైబర్‌సెల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్‌చేసి వివరాలు తెలియజే యాలన్నారు. లేదంటే సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. తదుపరి సిద్ది పేట పోలీస్ కమిషనరేట్‌లో ఉన్న సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్‌కు వచ్చి నేరుగా ఫిర్యాదు చేస్తే కేసు పరిశోధిస్తా మని ఆమె స్పష్టం చేశారు.

సొంతిల్లు కలేనా?!

మారని గుడిసె బతుకులు

- బిక్కుబిక్కుమంటూ జీవనం
- నెరవేరని 'డబుల్' ఆశలు
- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపు
- జిల్లాలో 15వేలకు పైగానే దరఖాస్తులు



ఎనగుర్తి గ్రామంలో



దుబ్బాక, ఏప్రిల్ 1 : స్వరాష్ట్రం సిద్ధించినా.. పాలకులు, ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మాత్రం మారడం లేదు. కాలుచాపే జాగలేక.. నిలువ నీడ లేక గుడిసెల్లో ఎంతో మంది పేదలు కాలం వెళ్లదీస్తున్నారు. తమ సొంతింటి కలను ఎప్పుడు నెరవేరుతుందోనని వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సయమంలో జిల్లాలో 15,929 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేసింది. వాటిలో 12వేల ఇళ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తి చేసి 11,743 ఇళ్లన నిర్మాణాలను చేపట్టారు. వాటిలో 10,665 ఇళ్లలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే లబ్ధిదారులకు అందుకు సంబంధించిన సర్టిఫికెట్లను అందించలేదు. జిల్లాలో 499 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో కేవలం 168 గ్రామాలకు మాత్రమే డబుల్ ఇళ్లను కేటాయించారు. 331 గ్రామాలకు డబుల్ బెడ్‌రూం నిర్మాణాలకు నోచుకోలేదు. బొప్పాపూర్, అచ్చుమాయిపల్లి, ఎనగుర్తి, పలు గ్రామాల్లో అనేక మంది పేదలు ఇంకా గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో స్థల వివాదం, స్థల కేటాయింపులో జాప్యం వల్ల చాలా గ్రామాలు డబుల్ ఇళ్ల నిర్మాణానికి నోచుకోలేదు.



దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో నిరుపేద గుడిసెలు

'ఇందిరమ్మ' ఇళ్లపై ఇంకా లేని స్పష్టత

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. అయితే, అధికారం లోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లతో పాటు మొదట సొంత స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించింది. అందుకు గృహలక్ష్మిని కూడా అధికారికంగా ప్రారంభించింది. ఆ పథకం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా కూడా అందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం విడుదల చేయలేదు. గ్రామపంచాయతీలో స్వీకరించిన దరఖాస్తులను వారి వద్దే ఉంచారు. జిల్లాలో సుమారు 15వేలకు పైగా దరఖాస్తులు అందాయని అధికారులు చెబుతున్నా అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. ఇక, గత ప్రభుత్వం ఒంటరి మహిళలకు, అనాథలకు, వృద్ధులకు, డబుల్ ఇళ్లను కేటాయించడానికి నిరాకరించింది. ప్రస్తుతం వారి పరిస్థితిపై అలాగే ఇళ్లస్థలం పంపిణీతో పాటు, గృహలక్ష్మి మంజూరులో ప్రభుత్వం తీసుకునే విధివిధానాలపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఈసారైనా సొంతింటి కల నెరవేరుతుందా? అని పేదలు ఎదురుచూస్తున్నారు.



ఎనగుర్తి గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న దృశ్యం

11వ వారం బుకింగ్ ఆదాయం

రూ.61.60 లక్షలు



బుకింగ్ కార్యాలయ ఆవరణలో బారులు తీరిన భక్తులు

చేర్యాల, ఏప్రిల్ 1 : కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ వారాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు 61.60 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. తలనీలాలు, ఆర్జితసేవలు, పట్నాలు, బోనాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.3,68,684, ఆదివారం రూ.51,91,804, సోమవారం సుమారు రూ.6లక్షల చొప్పున రూ.61.60లక్షలు ఆదాయం సమకూరింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ హెచ్చరిక
- పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీ

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 1 : జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం సిద్దిపేటలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ షాపులను ఆయన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం ఆసుపత్రులో పలు సౌకర్యాలు కల్పించకపోవడం, వైద్య పరీక్షలకు సంబంధించిన ధరల పట్టికలు, డాక్టర్ల పేర్లకు సంబంధించిన సూచిక బోర్డులను ఉంచకపోవడం, అర్హత లేని సబ్‌స్టాఫ్‌ను నియమించడంపై ఆరా తీశారు. అర్హత లేని వైద్యులతో చికిత్స, అధిక ఫీజు వసూలుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైర్ సేఫ్టీని పాటించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టు లేకపోవడం, అర్హత లేని వారితో మందుల పంపిణీ చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. గడువు పూర్తయిన ఆసుపత్రుల నిర్వాహకులు రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందితో వడదెబ్బ నివారణ చర్యలపై సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు శ్రీనివాస్, వినోద్‌బాబ్జి, డిప్యూటీ డెమో నవీన్, చైతన్య, డేనియల్ తదితరులు ఉన్నారు.



సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

418 సెంటర్లలో ధాన్యం సేకరణ

- 3.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక, ఏప్రిల్ 1 : జిల్లాలో 418 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేశామని, అవసరమైతే కొత్త కేంద్రాలనూ ప్రారంభిస్తామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కొండపాక మండలం రవీంద్రనగర్ విశ్వనాథపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సీజన్‌లో 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన, ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని ఆయన తెలిపారు. కౌలు రైతులను అధికారులు గుర్తించాలని, ఆ గుర్తింపు ద్వారానే ధాన్యాన్ని సేకరలించాలన్నారు. ధాన్యం విక్రయించిన వారంలో డబ్బు చెల్లిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం హరీశ్, వాసుదేవ్, శ్రీనివాస్, లింగారావు రైతులు ఉన్నారు.



విశ్వనాథపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

నయనానందం



వర్గల్ నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారిని హంస వాహనంపై మేళతాళాల మధ్య పుర వీధుల్లో ఊరేగించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి గజ వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉండనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.

- వర్గల్, ఏప్రిల్ 1

గజ్వేల్ ఐవోసీ.. అంతా గజిబిజి

- కార్యాలయాల కేటాయింపులో ఇష్టారాజ్యం
- ప్రజాసంబంధాల శాఖలకు ఇరుకు గదులు
- బోర్డులకే పరిమితమైన పలు కార్యాలయాలు
- తాళాలు వేసేందుకు సిబ్బంది దిక్కులేరు
- కొరవడిన కనీస వసతులు, పర్యవేక్షణ

గజ్వేల్, ఏప్రిల్ 1: గజ్వేల్ పట్టణంలో నిర్మించిన సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం(ఐవోసీ)లో గజిబిజి నెలకొన్నది. కార్యాలయాల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు క్యాడర్ స్ట్రెంత్ (తగినంత మంది సిబ్బంది)ను అలాట్ చేయకపోవడంతో కార్యాయాల అధికారులే తాళాలు తీసుకుని, వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని కార్యాలయాలైతే బోర్డులకే పరిమితమయ్యాయి.

మూడు బ్లాకులుగా ఐవోసీ భవనం

గత ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే గొడుగు కింద ఉండేలా పైలెట్ ప్రాజెక్టుగా డివిజన్ స్థాయిలో ఐవోసీ నిర్మాణాన్ని చేపట్టారు. గజ్వేల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఐదెకరాల స్థలంలో రూ.30కోట్ల వ్యయంతో పార్కింగ్, గార్డెనింగ్ విశాల వాతావరణంలో మూడు బ్లాకులుగా ఐవోసీ భవనాన్ని నిర్మించారు. జీ ప్లస్ టూ పద్ధతిలో మధ్యలో బీ బ్లాక్‌ను, ఏ, సీ బ్లాకులను జీ ప్లస్ వన్ పద్ధతిలో నిర్మించారు. మొత్తం 42 కార్యాలయాలు ఉన్నాయి.

కిటకిటలాడే శాఖలకు కటకట

ఐవోసీ కార్యాలయంలో ప్రాధాన్యత లేని శాఖలకు విశాల గదులను, ప్రజాసంబంధాలు ఉన్న శాఖలకు మాత్రం ఇరుకు గదులను కేటాయించారు. అధికారులు, సిబ్బంది, అవసరాల నిత్యం వచ్చే వారితో కిటకిటలాడే శాఖలకు ఇరుకుగదులను ఇవ్వడంతో ఇబ్బందుల మధ్య ఆఫీసుల్లో కాలంవెళ్లదీస్తున్నారు. ఐసీడీఎస్ కార్యాలయానికి ఐవోసీ కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్ కేటాయించారు. ఇక్కడికి సీడీపీవోతో పాటు కార్యాలయ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు నిత్యం వస్తూపోతూ ఉంటారు. ఈ శాఖకు కేవలం మూడు గదులే ఇవ్వడంతో అధికారులే కూర్చోవడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిత్యం రైతులకు అనుబంధంగా ఉండే వ్యవసాయ శాఖకు మూడు గదులతో కూడిన ఆఫీసునే ఇచ్చారు. దీంతో ఏఈవోలు, ఏవోలు, ఏడీ కార్యాలయం, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. ఎంపీడీవో కార్యాలయం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎంపీడీవో కార్యాలయంతో పాటు అనుసంధానంగా మానవ వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. కానీ పూర్తి భిన్నంగా ఎంపీడీవో కార్యాలయం గ్రౌండ్‌ఫ్లోర్‌లో తూర్పు దిక్కుగా ఉంటే పడమర దిక్కులో ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇదీ ఇరుకుగా ఉండడంతో ఇక్కడికి నిత్యం వచ్చే ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యాశాఖ సిబ్బందికి ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ విషయమై ఆయా శాఖల అధికారులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. ఐవోసీలోని ఏ బ్లాక్‌లోని పైఅంతస్తులో కొంత భాగాన్ని పోస్టాఫీసుకు కేటాయించారు. పోస్టాఫీసుకు పోలీస్‌స్టేషన్ పక్కనే విలువైన స్థలం ఉన్నా నిధులు మంజూరు చేయకపోవడంతో ఇన్నాళ్లు అద్దె భవనంలో కొనసాగింది.





తాళాలతో దర్శనమిస్తున్న పలు కార్యాలయాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఐవోసీలోకి మార్చాలన్న ప్రతిపాదన ఉన్నా డాక్యుమెంట్ రైటర్లు, ఇతర వ్యాపారులతో ఇబ్బందులు ఎదురవుతాయని విరమించుకున్నారు.

ఈ కార్యాలయాలకు తాళం

కాళేశ్వరం ఈఎన్‌సీ కార్యాలయం ఎప్పుడూ మూసి ఉంటుండగా, పంచాయతీరాజ్ క్యూసీ డీఈ కార్యాలయం, డివిజన్ ఎస్సీడబ్ల్యూవో కార్యాలయం, ఏపీడీ, డీఎల్పీవో, ఆత్మ కమిటీ కార్యాలయం, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ డీఈ కార్యాలయం, కాళేశ్వరం సబ్ డివిజన్ నెంబర్-3 డీఈ కార్యాలయం, ఐఅండ్ క్యాడ్ క్వాలిటీ కంట్రోల్ డీఈ సబ్ డివిజన్-4 కార్యాలయం ఎల్లప్పుడూ తాళాలతో దర్శనమిస్తున్నాయి.

మెయింటెనెన్స్ ఏదీ ?

భారీ ఎత్తున ఐవోసీని అయితే నిర్మించారు కానీ, కనీసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూర్చోవడానికి కుర్చీలను కూడా వేయించలేని నిస్సహాయ స్థితిలో అధికారులు ఉన్నారు. రాత్రయితే చాలు కార్యాలయం పూర్తిగా చిమ్మచీకట్లో దర్శనమిస్తుంది. కరెంట్ బిల్లు భారీ స్థాయిలో వస్తుండగా, మెయింటెనెన్స్‌కు ఏ శాఖ నుంచి డబ్బులు తీయాలో అర్థం కానీ పరిస్థితి ఉండడంతో లైట్లను ఆఫ్ చేస్తున్నారు. కార్యాలయంలోకి ఎక్కడి నుంచైనా వెళ్లే పరిస్థితి ఉన్నా కేవలం రెండు, మూడు ద్వారాలను మాత్రమే తెరవడంతో వారివారి కార్యాలయాలకు వెళ్లేందుకు చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంతేకాకుండా మూత్రశాలలను శుభ్రత కరువైంది. పలు మూత్రశాలలకు తాళాలు వేసి కనిపిస్తున్నాయి. ఐవోసీలో నాలుగు కాన్ఫరెన్స్ హాల్స్ ఉండగా దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. సీ బ్లాక్‌లోని పైఅంతస్తులో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌ను ఒకటి రెండు మార్లు మాత్రమే వినియోగించారు. ఈ బ్లాక్‌ను ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాన్ని కేటాయిస్తే వారికి ఇబ్బందులు తప్పుతాయి. ఐవోసీ కార్యాలయంపై జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా అస్తవ్యస్తంగా మారింది. హంగులతో నిర్మించిన కార్యాలయంలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందితేనే ప్రయోజనం కలుగుతుంది. లేనిపక్షంలో చూసి మురువడానికే అన్నట్లుగా భవనం మారిపోతుంది. బయోమెట్రిక్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగుల పనితీరును పర్యవేక్షించాల్సిన అవసరముంది.



ఐవోసీలో కుర్చీలు లేక నిల్చున్న ప్రజలు



గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవనం

తూప్రాన్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం

- ఇంటి అద్దె చెల్లించడం లేదని యజమాని చర్య
- మధ్యాహ్నం 12 గంటల వరకూ చూసి వెళ్లిన సిబ్బంది

7లో

బొమ్మారెడ్డిగూడెంలో ఎక్సైజ్ దాడులు

● అక్రమ మద్యం స్వాధీనం, కేసు నమోదు


గిరిజనతండాలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పుల్‌కల్, ఏప్రిల్ 1: చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజనతండాలో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గిరిజనతండాకు చెందిన నెనావత్ దేవీదాస్, మూడ్ అర్జున్ స్థానికంగా కిరాణ దుకాణాలు నిర్వహిస్తున్నారు. అదే కిరాణ దుకాణాల్లో అనుమతి లేకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు విజయ్‌కుమార్, సందీప్ రెడ్డి, హనుమంతు, ఇతర సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో నెనావత్ దేవీదాస్, మూడ్ అర్జున్ కిరాణా దుకాణాల్లో బీరు బాటిళ్లు, ఇతర దేశీ లిక్కర్ బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గ్రామాలు, గిరిజనతండాలు, గూడాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే తమకు తెలియజేయాలని ఆయన సూచించారు.

యువకుడి ఆత్మహత్య


రవి(ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్ 1: ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో నిశ్చితార్థం కావడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నవత, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దామరంచ గ్రామానికి చెందిన దోమల రవి(23) పొలం పనులతో పాటు కోళ్ల ఫారం పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. అయితే రవి ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో నిశ్చితార్థం కావడంతో మనస్తాపానికి గురైన రవి కోళ్ల ఫారంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నారాయణఖేడ్‌లో అగ్ని ప్రమాదం

● రూ.60 వేల నష్టం

నారాయణఖేడ్, ఏప్రిల్ 1: ఖేడ్ పట్టణం బసవేశ్వర చౌక్ సమీపంలోని శంకరప్ప ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. స్థానికులు అగ్నిమాక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పేశారు. ఆలోపే శంకరప్ప ఇంట్లోని ఫ్రిజ్, కూలర్, దుస్తులు, ఆహార ధాన్యాలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. దీంతో రూ.60 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

మన్‌సాన్‌పల్లిలో తాగునీటి తండ్లాట

● అందని ద్రాక్షగా 'మిషన్ భగీరథ'

● మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పినా పట్టించుకోని అధికారులు

కొండాపూర్, ఏప్రిల్ 1: ఆ గ్రామం తాగునీటి కోసం తండ్లాడుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన మంజీరా నీటి పథకం, తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకాలకు సంబంధించిన నీరు సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మన్‌సాన్‌ల్లి గ్రామానికి ఇంతవరకూ అందలేదు. 12 ఏళ్ల నాటి మంజీరా సురక్షిత మంచినీరు పేరు మారిందే.. కానీ మా గ్రామానికి చుక్కనీరు రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. మన్‌సాన్‌పల్లి సంగారెడ్డి జిల్లా అయినా రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలకు 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వికారాబాద్ జిల్లాకు సరఫరా అయ్యే కృష్ణానది జలాల పైపులైన్ ఈ గ్రామ పరిసరాల నుంచే వెళ్తున్నది. రెండు కిలోమీటర్ల దూరంలోని ఎల్లకొండ శివారులో కృష్ణా జలాల లిఫ్టింగ్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ సైతం అందుబాటులో ఉన్నది. అయినా గ్రామానికి చుక్క నీరు అందని పరిస్థితి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సురక్షిత మంచినీటి పేరుతో మంజీరా నీటి పథకాన్ని అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి 2012లో కొండాపూర్ మండలంలో ప్రారంభించారు. ప్రతి గ్రామానికి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. మన్‌సాన్‌పల్లికి పైపులైన్ వేసినా గ్రామం ఎత్తులో ఉండడంతో నీరు అందలేదు. పైపులైన్లు పగిలిపోవడంతో సర్పంచ్ సొంత డబ్బులతో పైపులు మార్చినా ఫలితం లేదు. ఆ తర్వాత ఎన్నికైన పంచాయతీ పాలకవర్గం జిల్లా మంత్రులను, అధికారులను కలిసినా ప్రయోజనం లేదు. కృష్ణా జలాలను అందించేందుకు రెండు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, చింతా ప్రభాకర్ రెండు జిల్లాల ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరారు. 2019లో ఎమ్మెల్యే జగ్గారెడ్డి మన్‌సాన్‌పల్లి నుంచి వెళ్తున్న కృష్ణానది జలాలను పైపుల ద్వారా సరఫరా చేయాలని సంబంధిత అధికారికి నిధులిచ్చినా.. సరైన ప్రణాళిక లేక నీళ్లు అందించడంలో విఫలమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మన్‌సాన్‌పల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్



వికారాబాద్, హైదరాబాద్ ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న మన్‌సాన్‌పల్లి ముఖద్వారం



మంజీరా నీటి కోసం మొదటి విడత వేసి వదిలేసిన పైపు(ఫైల్)

ప్రజాధనాన్ని నిర్వీర్యం చేశారు



మంజీరా నీటిని ప్రజలకు అందించాలని 2013లో రూ.2 లక్షలు ఖర్చుచేసి పైప్‌లైన్ వేయించినా లాభంలేదు. గ్రామ సమీపం నుంచే కృష్ణా జలాలు సరఫరా అవుతున్నా.. మాకు అందడం లేదు. ప్రతిపాదనలు, ప్రణాళికలు సరిగ్గా లేక మూడుసార్లు పైపులను మార్చారు. పథకం అమలు పేరుతో అధికారులు ప్రజాధనాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.

\- వెంకటమ్మ, మాజీ సర్పంచ్

మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పినా వినలేదు



నీటి సమస్యను పరిష్కరించాలని రెండు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు రెండు జిల్లాల ఉన్నతాధికారులు, మిషన్ భగీరథ ఈఈలతో మాట్లాడి సమస్యను తీర్చాలన్నారు. అప్పుడు సరే అన్న అధికారులు.. ఆ తర్వాత పట్టించుకోలేదు. ఇప్పుడేమో మీ గ్రామానికి నీరు ఇవ్వాలంటే.. మా పరిధిలోని గ్రామానికి నీరు ఇవ్వాలని అధికారులు సాకులు చెబుతున్నారు.

\- అనితానర్సింహులు, మాజీ సర్పంచ్

నీటిని సరఫరాకు ప్రయత్నం చేస్తున్నాం

నేనొచ్చి సంవత్సరమైంది. అంతకుముందు సమస్య తెలియదు. వికారాబాద్ జిల్లా ఈఈతో మాట్లాడి నీటి సరఫరాకు పైపులను అమర్చాం. వారి పరిధిలోని గ్రామాలకే సరిపడా నీరు లేదని తెలిసింది. మునిదేవునిపల్లిలో సంప్ ఏర్పాటు చేసి పంపింగ్ చేయాలనే ప్రపోజల్స్ పంపించాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. గ్రామానికి నీరు అందించేందుకు చర్యలు చేపడతాం.

\- సుచరిత, మిషన్ భగీరథ డీఈ

తూప్రాన్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం

● ఇంటి అద్దె చెల్లించడం లేదని యజమాని చర్య

● మధ్యాహ్నం 12 గంటల వరకూ చూసి వెళ్లిన సిబ్బంది

తూప్రాన్, ఏప్రిల్ 1: అద్దె చెల్లించడంలేదని ఆగ్రహించిన ఇంటి యజమాని కార్మికులకు వైద్య సేవలు అందించే ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం వేశాడు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. శివ్వంపేట మండలం శబాష్‌పల్లిలో కార్మికులకు సేవలందించేందుకు ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయగా, ఇది తూప్రాన్ పట్టణంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్నది. పట్టణ పరిధి పోతరాజుపల్లిలోని ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ఈ డిస్పెన్సరీ ఇంట్లో నిర్వహిస్తున్నారు. అయితే, గతేడాది జూలై నుంచి అద్దె చెల్లించడం లేదు. అలాగే, అద్దెను కూడా పెంచాలంటూ కోరుతూ యజమాని ప్రతాప్‌రెడ్డి ఈఎస్ఐ సిబ్బందికి లేఖ అందజేశారు. అయినప్పటికీ అద్దె చెల్లింపులు చేయకపోవడం, పెంపును అమలు చేయకపోవడంతో యజమాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఈఎస్ఐ ఆస్పత్రి డిస్పెన్సరీకి తాళం వేశాడు. దాంతో విధులకు వచ్చిన సిబ్బంది, వైద్యుడు బయటే ఉండిపోయారు. అద్దె చెల్లింపులు చేయడంతోపాటు, అద్దె పెంపు తేల్చాలంటే యజమాని పట్టుబట్టారు. చేసేదీ లేక సిబ్బంది బయటే ఉండిపోయారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూసిన ఇబ్బంది, వైద్యుడు గత్యంతరం లేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ తాళం తెరచుకోకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పోతరాజుపల్లిలో తాళం వేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీ, బయట నిలిచిన సిబ్బంది

యేడాది కాలంగా అద్దె రావాలి

ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె గతేడాది మార్చి నుంచి రావాల్సి ఉంది. నాలుగేళ్లుగా అద్దెను కూడా పెంచి ఇవ్వాలని కోరుతున్నాను. పెండింగ్ అద్దెలు చెల్లించేందుకు అగ్రిమెంట్ చేయిస్తూ మోసం చేస్తున్నారు. 9 గదుల భవనానికి కేవలం రూ. 9,700లు చెల్లిస్తున్నారు. రూ.20వేలు చెల్లించాలి. బకాయి అద్దె వెంటనే ఇవ్వాలి.

\- ప్రతాప్‌రెడ్డి, భవన యజమాని

చెరువులో జారిపడి వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

మెదక్ అర్బన్, ఏప్రిల్ 1: చెరువులో జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు.. స్థానిక బ్రాహ్మణ వీధికి చెందిన శివనూరి సత్యనారాయణ(52) పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. గతనెల 28న తొగిటలో ఉంటున్న చిన్న కూతురు రజిత ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి 29 శుక్రవారం సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య సునీత కూతురుకు ఫోన్‌చేయగా.. ఇంటి నుంచి బయలుదేరాడని చెప్పింది. దాంతో పరిసర ప్రాంతాల్లో గాలించారు. సోమవారం స్థానిక పిట్లంచెరువులో మృతదేహం నీటిపై తేలింది. దాంతో హోటల్ యజమానికి సమాచారమందించారు. మృతదేహాన్ని చూసిన కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

చిల్వర్ వద్ద రోడ్డు ప్రమాదం

● ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన మరో లారీ

● క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్, అరగంట పాటు నరకయాతన

అల్లాదుర్గం, ఏప్రిల్ 1: అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామం వద్ద గల 161వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. అల్లాదుర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం పట్టణానికి సామగ్రితో లారీ వెళ్తున్నది. చిల్వర్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ టైర్ పగిలిపోవడంతో ఒక్కసారిగా నిలిచిపోయింది. దీంతో వెనకున్న లారీ ముందు లారీని ఢీకొట్టడంతో లారీ ముందుభాగం నుజ్జునుజ్జయింది. లారీ డ్రైవర్ విజయ్‌కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి సుమారు అరగంట పాటు నరకయాతను పడ్డాడు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పోలీసులకు సమాచారమందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి లారీ డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి తీసి.. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అవస్థ పడుతున్న డ్రైవర్ విజయ్‌కుమార్

గజ్వేల్‌లో 200 గ్రాముల గంజాయి స్వాధీనం

గజ్వేల్, ఏప్రిల్ 1: గజ్వేల్ పట్టణంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డులోని శ్మశానవాటిక వద్ద ఇద్దరు గంజాయిని విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారంతో సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయి, ఓ మోటార్ సైకిల్, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులు హైదరాబాద్‌లో తమ స్నేహితుల వద్ద నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

అధికారుల కృషితో నల్లచెరువు నీటి విడుదల

● హర్షం వ్యక్తం చేస్తున్న చెన్నాయిపల్లి రైతులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 1: చిన్న శంకరంపేట మండలంలోని చెన్నాయిపల్లి గ్రామ రైతుల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కొన్నిరోజులుగా శాలిపేట గ్రామానికి చెందిన రైతులు చెన్నాయిపల్లి పంట పొలాలకు నల్లచెరువు నుంచి నీరు విడుదల చేయకుండా అడ్డుకున్న సంగతి విదితమే. దీంతో రైతులు నల్లచెరువు నుంచి నీటిని విడుదల చేయాలని శాలిపేట గ్రామస్థులను కోరగా నిరాకరించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండురోజులుగా ఇరుగ్రామాల పెద్దలను సమన్వయ పరిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. పంటలు ఎండిపోవడాన్ని చూసి చలించిన అధికారులు చెరువు నుంచి నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు. శాలిపేట గ్రామస్థులు సహకరించడంతో చెన్నాయిపల్లి గ్రామ శివారులోని పంటలకు నీరు చేరుకుంటున్నది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శాలిపేట నల్లచెరువు నుంచి విడుదలవుతున్న నీళ్లు

విద్యాధరి క్షేత్రంలో వైభవంగా మూలమహోత్సవం

● విద్యాసరస్వతీ అమ్మవారికి లక్ష పుష్పార్చన

● భక్తి పారవశ్యమైన శంభుగిరి కొండలు

వర్గల్, ఏప్రిల్ 1: వర్గల్ శంభుగిరి కొండలపై వెలసిన విద్యాధరి క్షేత్రంలో విద్యా సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్ర మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో మూల మహోత్సవానికి అంకురార్పణ చేశారు. ఆలయ మండపంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు, వేద విద్యార్థులు లక్ష పూలపూజ చేశారు. ఆలయ యాగశాలలో చండీహోమం నిర్వహించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఆలయ కమిటీ మహా అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. సరస్వతీ అమ్మవారి దర్శనంతో పాటు క్షేత్రంలోని ఉప ఆలయాలైన లక్ష్మీగణపతి, కల్యాణ వెంకటేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడాయి.



లక్ష పుష్పార్చన చేస్తున్న భక్తులు, వేద విద్యార్థులు



తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో పంట కాపాడుకోవడానికి ట్యాంకర్ ద్వారా నీటిని పోస్తున్న రైతు



శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్‌లో ట్యాంకర్ ద్వారా పంటకు నీరందిస్తున్న రైతు

రైతుల భగీరథ ప్రయత్నం

● చేతికొచ్చిన పంట కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని తరలింపు

తొగుట/శివ్వంపేట, ఏప్రిల్ 1: తలాపున మల్లన్నసాగర్ ఉన్నా.. బోరుబావుల్లో నీటి ఊటలు అడుగంటిపోయాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే ఎండిపోతుంటే కాపాడుకునేందుకు తొగుట మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన రైతు చిక్కుడు చంద్రం భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. తనకున్న మూడెకరాల పొలంలో ఇప్పటికీ ఏడు బోర్లు వేయించినా.. రెండు బోర్లలో మాత్రమే కొద్దిపాటి నీరు వచ్చింది. ఆ నీటితో వరి సాగుచేశాడు. పంట చేతికందే దశలో ఉన్న బోరులో నీటి ఊటలు అడుగంటిపోవడంతో పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. పంటను ఎలాగైనా కాపాడుకోవడం కోసం మూడురోజులుగా ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి పారిస్తున్నాడు. పంట సాగుకోసం ఇప్పటివరకు సుమారు రూ.70 వేలు పెట్టినట్లు రైతు వాపోయారు. అలాగే శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి తన పది గుంటల పొలంలో ఆకు కూరలు సాగుచేశాడు. పంట చేతికొచ్చిన సమయంలో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఐదురోజులుగా ట్యాంకర్ ద్వారా నీరు తెచ్చి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

తుంపర్ల సాగుతో అధిక లాభాలు

● తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి ● మిర్చి సాగులో దర్గపల్లి ఆదర్శం

నంగునూరు, ఏప్రిల్ 1: తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై రైతులు దృష్టిసారిస్తున్నారు. తుంపర్ల సేద్యంతో అధిక లాభాలు ఉండడంతో ఆరుతడి పంటలైన వేరుశనగ, మొక్కజొన్న, బీరకాయ, కాకరతో పాటు పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల తోటలను వ్యవసాయ అధికారుల సూచనలతో సాగుచేసేందుకు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగానే నంగునూరు మండలం దర్గపల్లి గ్రామంలో రైతులు తుంపర్ల ద్వారా మిర్చి పంటను సాగుచేస్తున్నారు. మిర్చి పంట సాగుతో గ్రామంలో కూలీలకు ఉపాధితో పాటు మంచి లాభాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రతి యాసంగిలో ఈ గ్రామంలో పెద్దఎత్తున మిర్చి పంటలు సాగుచేస్తూ మంచి లాభాలు పొందుతున్నారు. ఈసారి గ్రామంలో 200 ఎకరాల్లో మిర్చి సాగుచేస్తున్నారు. గత శివరాత్రి నుంచి మిర్చికి మంచి రేటు ఉండడంతో వ్యాపారులే రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రతిసారి ఇక్కడి నుంచి కరీంనగర్, వరంగల్, సిద్దిపేట ప్రాంతాల్లోని మార్కెట్‌కు తరలించేవారు. ఈసారి ఇతర జిల్లాల కంటే సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోనే కిలో మిర్చికి రూ.45 నుంచి రూ.50లు పలుకుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దర్గపల్లిలో తుంపర్ల ద్వారా పంటలు సాగుచేస్తుంటే, వెంకటాపూర్‌లో మాత్రం రైతులు బిందు సేద్యం ద్వారా కూరగాయల పంటల సాగుచేస్తూ జిల్లాలోని ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుత ఎండాకాలంలో వరి సాగుచేస్తే పంట చేతికి వచ్చే దశకు ఎండిపోయి రైతులు నష్టాలకు గురవుతున్నారు. ఆరుతడి పంటలపై దృష్టిసారిస్తే అధిక లాభాలు పొందొచ్చు అనడానికి దర్గపల్లి, వెంకటాపూర్ గ్రామాలే నిదర్శనం.



నంగునూరు మండలం దర్గపల్లి గ్రామంలో సాగుచేస్తున్న మిర్చి పంట

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

● అదనపు డీఆర్డీవో మధుసూదన్

తొగుట, ఏప్రిల్ 1: రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి లబ్ధిపొందాలని అదనపు డీఆర్డీవో మధుసూదన్ సూచించారు. మండలంలోని బండారుపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం మగ్దుమ్ అలీ, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి మోహన్, పీఆర్ఏఈ రామకృష్ణారెడ్డి, గ్రామ సంఘం అధ్యక్షులు మమత, స్వర్ణలత, సీసీ రజని, సీఏలు శ్రీనివాస్‌రెడ్డి, మంగ, పంచాయతీ కార్యదర్శి అశ్విని, పాల్గొన్నారు

● **సిద్దిపేట అర్బన్:** ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలో సోమవారం ఎంపీడీవో మార్టిన్ లూథర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసరావు, ఏపీఎం చంద్రం, మాజీ సర్పంచ్ రాజయ్య పాల్గొన్నారు.

● **నంగునూరు:** మండలంలోని రాజగోపాల్‌పేట, ముండ్రాయి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలను సోమవారం ఏపీఎం ఆంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో గీత, ఏఈవో అశోక్, వీవో లీడర్లు గ్రామస్థులు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** మండలంలోని ధర్మారంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం కిష్టారెడ్డితో కలిసి ఎంపీడీఓ గణేష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో నిర్మల, పంచాయతీ కార్యదర్శి తులసి, సీసీ ప్రభాకర్, గ్రామస్థులు బాగులు, నర్సింహ్మారెడ్డి తదితరలున్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు


బండారుపల్లిలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మధుసూదన్

కేంద్రాన్ని గజ్వేల్ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్‌లు సోమవారం ప్రారంభించారు. వారితో మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎంపీవో దయాకర్, ఏపీవో, సీసీ రమేశ్‌రెడ్డి, మార్కెట్ సూపర్‌వైజర్ మహిపాల్ ఉన్నారు.

● **నారాయణరావుపేట:** నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి గ్రామంలో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో శ్రీరాములు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం ధర్మసాగర్, ఐకేపీ మహిళలలు తదితరులు పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి సోమవారం డీఆర్డీవో జగదేవ్ ఆర్య ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డీపీఎం కరుణాకర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం నరసయ్య వ్యవసాయ అధికారి సంతోష్, సూపరింటెండెంట్ అంజయ్య, ఎంపీవో విష్ణు, ఐకేపీ సిబ్బంది, పాల్గొన్నారు.

● **దుబ్బాక/దుబ్బాకరూరల్/అక్బర్‌పేట-**


ధర్మారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో గణేష్‌రెడ్డి

భూంపల్లి: దుబ్బాక నియోజకవర్గంలోని వివిధ గ్రామాలల్లో సోమవారం ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రంలను ప్రారంభించారు. దుబ్బాక మండలం అప్పనపల్లి, అక్బర్‌పేట- భూంపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం డాకయ్య, కార్యదర్శి దీపిక, ఇందిరా, దేవవ్వ, అక్బర్‌పేట గ్రామంలో ఏపీఎం క్రిష్ణరెడ్డి తదితరులున్నారు.

● **రాయపోల్:** రాయపోల్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకుడు బాబూనాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో గిర్దావర్ భానుప్రసాద్. ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీలు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

● **వర్గల్:** వర్గల్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈవో జితేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శేషశయన, ఎంపీడీవో పాల్గొన్నారు.

● **మద్దూరు:** ఐకేపీ ఆధ్వర్యంలో మద్దూరు మండలంలోని నర్సాయపల్లి స్వర్ణ గ్రామైఖ్య సంఘం, అర్జున్‌పట్లలో స్నేహ గ్రామైఖ్య సంఘం, రేబర్తి సొసైటీ ఆధ్వర్యంలో వల్లంపట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రా


బెజ్జంకిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో జగదేవ్ ఆర్య

లను డీపీఎం విద్యాసాగర్, సీఈవో బోయిని శ్రీదర్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం బాబారావు, సీసీలు సిద్ధిమల్లయ్య మహేందర్, నర్సాయపల్లి, అర్జున్‌పట్ల గ్రామాల అధ్యక్షకార్యదర్శులు పోతుగంటి నవనీత, ముస్త్యాల మంజుల, భైతి లలిత, ఆషియాబేగం, వివోఏ పోతుగంటి స్రవంతి, కోశాధికారి బద్దిపడిగె సుశీలతో పాటు గ్రామస్థులు, హమాలీలు పాల్గొన్నారు.

● **దూళిమిట్ట:** మండలంలోని కూటిగల్ గ్రామంలో రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సొసైటీ సెక్రెటరీ శ్రీధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, హమాలీలు, పాల్గొన్నారు.


దూళిమిట్టలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సెక్రెటరీ శ్రీధర్

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దుబ్బాక, ఏప్రిల్ 1: ఎన్నికల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు ఇవ్వవద్దని జిల్లా అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ లచ్చపేట మోడల్ స్కూల్‌లో జరిగిన ఎన్నికల సిబ్బంది శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. సిబ్బంది ఎన్నికల విషయంలో ఆదమరిచి వ్యవహరిస్తే సమస్యలు తలెత్తుతాయన్నారు. దుబ్బాక అసెంబ్లీకి సంబంధించిన 250 మంది పీవో, ఏపీవోలకు, 27 మంది సెక్టర్ ఆఫీసర్లకు శిక్షణను అందించారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య


విద్యాసాగర్ మృతదేహం

హుస్నాబాద్, ఏప్రిల్ 1: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ తోట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామానికి చెందిన విద్యాసాగర్ (43) హుస్నాబాద్‌లో నివాసముంటూ ఎలక్ట్రీషన్‌గా, విద్యుత్ బిల్లులు కొడుతూ జీవిస్తున్నారని చెప్పారు. కొన్ని రోజులుగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ కారణంగానే ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. సోమవారం ఉదయం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో మృతదేహన్ని గుర్తించామని పేర్కొన్నారు. మృతుని భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాజకుమార్ (ఫైల్)

అక్కన్నపేట, ఏప్రిల్ 1: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన భాషవేని రాజకుమార్(23) సోదరికి కొన్ని నెలల క్రితం వివాహం ఓ వ్యక్తితో వివాహ జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు కూడా చేశారు. విడాకులు కావాలని సోదరి భర్త కోరడంతో మనస్తాపం చెందిన రాజ్‌కుమార్ మార్చి 28న పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

దుబ్బాక, ఏప్రిల్ 1: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌లో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగిన్‌పల్లి ఎల్లవ్వ బిక్కనూర్ మండలం కాశాపూర్ గ్రామంలో ఉండే తన కూతురు దగ్గరకు వెళ్లింది. విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్లవ్వ గ్రామానికి చేరుకుంది. ఇంట్లోని 25వేల నగదుతోపాటు పట్టపాస్‌బుక్‌లు, వంటసామగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

నిరుపేదలకు అండగా నిలవడానికే ట్రస్టు

● బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 1: నిరుపేద విద్యార్థులకు అండగా నిలబడటానికే 100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేటలోని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో జరిగిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ యూత్, విద్యార్థి, సోషల్ మీడియా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జిల్లా సమస్యలు తనకి తెలుసని, ఢిల్లీలో పోరాటం చేసి వాటిని పరిష్కరిస్తానన్నారు. ఎంపీగా తన గెలుపు ఖాయమన్నారు. ఈ గెలుపులో యువత పాత్ర కీలకమన్నారు. గెలిచిన నెల రోజుల్లో 100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి యువతకు అండగా నిలుస్తానన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

గజ్వేల్, ఏప్రిల్ 1: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కార్మిక, ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాణే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ యూనియన్(సీఐటీయూ) సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ, కార్మిక చట్టాలు రద్దు చేసి, ప్రజాస్వామ్యం లేకుండా చేసిందని విమర్శించారు. పోరాడి సాధించిన కార్మిక చట్టాలను రద్దుచేసి యాజమాన్యాలకు అనుకూలంగా కోడ్‌లను రూపొందిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, రాణే పరిశ్రమ యూనియన్ నాయకత్వం వేణుగోపాల్, బండ్ల స్వామి, బిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, సాజిద్, నర్సింలు, స్వామి, మల్లయ్య, రాజగోపాల్ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలి

● మాలమహానాడు రాష్ట్రప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ

చేర్యాల/హుస్నాబాద్ ఏప్రిల్ 1: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈవిషయమై జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 8వతేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్రప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ అన్నారు. చేర్యాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహావరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యాంగ రక్షణయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కమలాపురం కిష్టయ్య, పుట్ట యాదయ్య, శ్రీరాం మల్లయ్య పుట్ట రాజు, పాకనాటి భాస్కర్, గుస్క కిష్టయ్య, అనిమల్ శ్రీధర్, బడుగు అనిల్, కాటం రాజశేఖర్, చింటు తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాలమాహానాడు ఆధ్వర్యంలో చేపట్టే రాజ్యాంగ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఫాసిజాన్ని నిర్మూలించి రాజ్యాంగాన్ని రక్షించాలనే లక్ష్యంతో రాజ్యాంగ రక్షణ యాత్ర చేపట్టినట్లు మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు బూరుగు కిష్టస్వామి, యాస శ్రీనివాస్, బందెల హరీశ్, గడ్డం సదానందం, నోముల బాలయ్య, బూరుగు సతీష్, వెంకటస్వామి, రమేశ్, వినోద్, స్వామి, సాయికిరణ్, రాజయ్య తదితరులున్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటి విడుదలు

కొండపాక, ఏప్రిల్ 1: కొండపాక మండలానికి తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా సాగునీరు సోమవారం విడుదలైంది. డి 4 కెనాల్ ద్వారా కొండపాక మండలంలోని పలు గ్రామాల చెరువులకు సాగునీరు అందుతుంది. కానీ కొద్ది రోజుల క్రితం నీరు రాకుండా కాలువకు మట్టితో అడ్డుకట్ట వేశారు. రైతులు, నాయకులు మట్టిని తొలగించడం కోసం వెళ్తుంటే పోలీసులు అడ్డుకొని చర్యలు తీసుకుంటామని, ఎలాంటి గొడవలు దిగవద్దని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి మట్టిని తొలగింప చేశారు. దాంతో సోమవారం నుంచి నీరు విడుదలైంది. కానీ అక్కడక్కడ మట్టి పేరుకుపోవడంతో స్థానిక రైతులు వాటిని తొలగించుకున్నారు. తిమ్మారెడ్డిపల్లి వద్ద కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులతో కలిసి సోమవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీ యూసీజిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవీందర్, పరశురాములు, ఎన్ఎస్‌యూఐ నాయకులు రవి, భానుచందర్, బీజేపీ మండల కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 1: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన డ్రైవర్ దండు జహంగీర్ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందావడు. దీంతో డైమండ్ లారీ డ్రైవర్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల నుంచి విరాళాలు సేకరించి 68 వేల రూపాయలు జహంగీర్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో డైమండ్ లారీ డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు కనకయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేశ్, బాలరాజు, రవి, షాదుల్లా, శ్రీను, కనకయ్య, రాజు, సూరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

దూళిమిట్ట, ఏప్రిల్ 1: దూళిమిట్ట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం గౌడ కులస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

చిన్నకోడూరు, ఏప్రిల్ 1: పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకోని బాధితునికి అప్పగించారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇబ్రహీంనగర్‌కు చెందిన సదాబోయిన విజయ్ తన ఫోన్‌ను మార్చి 06 న ఇబ్రహీంనగర్‌లో పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను స్వాధీనం చేసుకోని సోమవారం బాధితునికి అందజేశారు.

చెరువు శిఖం కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

కోహెడ, ఏప్రిల్ 1: మండలంలోని శ్రీరాములపల్లి గుండ్లకుంట చెరువు శిఖంను కాపాడాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ ముంజ మంజుల శ్రీనివాస్ సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రెండు రోజుల నుంచి ఈ శిఖం భూమిలో గ్రామానికి చెందిన ఒక రైతు నూతన బావిని తవ్వుతున్నాడని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం

చేర్యాల, ఏప్రిల్ 1 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ నిత్యాన్నదానానికి మహబూబాబాద్‌కు చెందిన దాసరి శేఖర్ రూ.50,116 నగదు విరాళంగా అందించాడు. ఈసందర్భంగా సోమవారం ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి చేతులమీదుగా విరాళాన్ని అందజేశారు. ఆయనవెంట పునరుద్ధరణ కమిటీ సభ్యుడు అల్లం శ్రీనివాస్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఉన్నారు.

ఐనాపూర్ చెక్‌పోస్ట్ వద్ద మద్యం పట్టివేత

చేర్యాల, ఏప్రిల్ 1: కొమురవెల్లి మండలం ఐనాపూర్ చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన తనఖీలో సోమవారం నాలుగు కాటన్‌ల బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని ఓ వైన్‌షాపులో కొనుగోలు చేసిన బీరు కాటన్లను సంచిలో పెట్టుకుని బైక్‌పై కొండపోచమ్మవద్దకు తీసుకుని వెళుతుండగా చెక్‌పోస్ట్ వద్ద పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం కొమురవెల్లి పోలీసులకు అప్పగించారు.

చేర్యాల ఇన్‌చార్జి ఎంఈవోగా శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 1: చేర్యాల ఎంఈవోగా కొండపాక ఎంఈవో పి. శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. కొన్నాళ్లుగా చేర్యాల, మద్దూరు, దూళిమిట్ట మండలాల ఎంఈవోగా పనిచేస్తున్న ఎం. నర్సింహ్మారెడ్డి ఇటీవల పదవీ విరమణ చేయడంతో కొండపాక ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డికి చేర్యాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆస్తి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల, ఏప్రిల్ 1: ఆస్తి పన్ను వసూలు ఎర్లీబర్డ్ ప్రకారం అందించే 5శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ జినర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'కాషాయజెండాను ఎగురవేద్దాం'

గజ్వేల్, ఏప్రిల్ 1: సమష్టిగా పనిచేసి మెదక్ పార్లమెంట్‌పై కాషాయజెండాను ఎగురవేద్దామని బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్‌తో కలసి నియోజకవర్గ బీజేవైఎం బాధ్యులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. వారితో బీజేవైఎం నాయకులు ఉన్నారు.

వెంకట్రామారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కొండపాక/ములుగు ఏప్రిల్ 1: మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలచందర్ గౌడ్ పేర్కొన్నాడు. సోమవారం కొండపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు ఒరగబెట్టింది ఏమీలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దోమల దుర్గాప్రసాద్, సాధుపల్లి కనక సేన గౌడ్, నాయకులు పాండుగౌడ్, కొడకండ్ల వెంకటేష్‌గౌడ్ ,తిప్పారం హరీశ్‌గౌడ్, ఉనుగురి జైపాల్, శివ పాల్గొన్నారు. రాష్ట్రంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ములుగు పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి అన్నారు. సోమవారం ములుగులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో దేశాన్ని తలదన్నే విధంగా గత కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిదని, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో అందని ద్రాక్షగా విద్య

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 1: ప్రభుత్వ విద్యాలయాల్లో అందని ద్రాక్షగా విద్య మారుతున్నదని బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సాడిమల డేవిడ్ పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలని బీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్వామి, భాను, ప్రియాంక, రుచిత, అమీనా, కవిత, రోహిత్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప-కామరాతి కల్యాణం


బీరప్ప-కామరాతి కల్యాణం

చేర్యాల, ఏప్రిల్ 1: చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో బీరప్ప దేవాలయంలో సోమవారం దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీరప్ప, కామరాతి, చౌడలమ్మ దేవతా విగ్రహాలకు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి యంత్ర ప్రతిష్ఠ చేశారు. అనంతరం లింగాలను పూజించి బీరప్ప -కామరాతి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని దేవతామూర్తులకు నివేదించి తమ కష్టాలు తొలగించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి అయిలయ్య శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు బండారి శ్రీశైలం తదితరులు హాజరవగా, స్థానిక కురుమసంఘం నాయకులు సత్కరించారు.

పార్లమెంటు ఎన్నికల అధికారులకు శిక్షణ

హుస్నాబాద్, ఏప్రిల్ 1: కరీంనగర్ పార్లమెంటులోని హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ అధికారులకు సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో రామ్మూర్తి హాజరై ఎన్నికల నియామావళిపై అవగహన కల్పించినారు. 546 మంది పోలింగ్ అధికారులకు నాలుగు దఫాలుగా శిక్షణ నిర్వహిస్తామని, ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఇందులో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌడలమ్మ ఆలయంలో ఉత్సవాలు


చౌడలమ్మ ఆలయం

చిన్నకోడూరు, ఏప్రిల్ 1: కల్యాణ మహోత్సవానికి చిన్నకోడూరు మండలం కేంద్రంలోని చౌడలమ్మ ఆలయం ముస్తాబైంది. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకోని రేపటి నుంచి సోమవారం వరకు ఆరు రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీ కృష్ణ యాదవ సంఘం సభ్యులు తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

మద్దూరు, ఏప్రిల్ 1 : మద్దూరు మండల కేంద్రానికి చెందిన ఎ. చేతన్ జాతీయస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల కరీంనగర్‌లో నిర్వహించిన సీనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా తరపున పాల్గొని ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల విజయ్‌బాబు తెలిపారు. చేతన్ ఎంపికపట్ల సిద్దిపేట జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఉపేందర్, మల్లేశం, స్పోర్ట్స్ హబ్ కన్వీనర్ సాయిరాం, అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

బీఆర్ఎస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు

● ఎమ్మెల్యే గడ్డం వివేక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వివేక్

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 1: బీఆర్ఎస్‌కు గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. సోమవారం మండలంలోని పీర్లపల్లి గ్రామంలో శ్రీ మల్లికార్జున ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో 10 ఏళ్ల పాటు బీఆర్ఎస్ రాక్షస పాలన చేసిందని అన్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని, ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయం అన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వివేక్, పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి వంశీలను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మన్ మల్లేష్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి ● బీజేపీ డిమాండ్

కోహెడ, ఏప్రిల్ 1 : రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కోహెడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా రైతులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆరోపించారు. హామీలను వెంటనే అమలు పరిచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, నాయకులు పిల్లి నర్సయ్య, జాలిగం రమేశ్, రజనీకాంత్‌రెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్, రాంచంద్రారెడ్డి, తిరుపతి, వెంకటేశ్వర్లు, రాజు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

● **బెజ్జంకి:** బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆదేశానుసారం మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి, తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు సోమవారం వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ నాయకులు రవి, సత్యనారాయణ, రామచంద్రం, రమేష్, అజయ్, రవికుమార్, వెంకటేశం, శంకర్, నరేష్, ఎల్లం గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


బెజ్జంకిలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

● **హుస్నాబాద్:** రైతాంగాన్ని ఆదుకోవాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఈ విషయంపై బీజేపీ నాయకులు హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తికి వినతిపత్రం సమర్పించారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ. 10వేలు పరిహారం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల, వేణుగోపాల్‌రావు, శంకర్‌బాబు, స్వరూప, కర్ణకంటి నరేష్, రాంప్రసాద్ తదితరులున్నారు.

కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 1: కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై సిద్దిపేట టూటౌన్ పోలీసులు దాడి చేసి, తయారీ చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా ఆమనగల్‌కు చెందిన ఇస్లావత్ గోవింద్ దోబి గల్లి పరిధి భోగేశ్వర ఆలయ సమీపంలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. స్థానికుల సమాచారం మేరకు తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి కల్తీ నెయ్యి తయారీకి వినియోగించే పదార్థాలను సీజ్ చేసి సదరు వ్యక్తిని అరెస్ట్ చేశారు.

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

● బీఆర్ఎస్ కొమురవెల్లి మండల నాయకుడు ఏర్పుల మహేశ్

చేర్యాల, ఏప్రిల్ 1: నిరుద్యోగులపై భారం మోపకుండా ప్రభుత్వం టెట్ పరీక్ష రుసుమును తగ్గించాలని బీఆర్ఎస్ కొమురవెల్లి మండల నాయకుడు ఏర్పుల మహేశ్ కోరారు. కొమురవెల్లి మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల వివక్ష వహిస్తున్నదని, ఒక్క నియామకం కూడా చేపట్టకపోగా, టెట్ పరీక్ష ఫీజును రూ.200 నుంచి రూ.1000కి పెంచి మోయలేని భారం మోపిందన్నారు. నిరుద్యోగుల నుంచి ఒక్క రూపాయి ఫీజు కూడా వసూలుచేయబోమని చేసిన హామీని నిలబెట్టుకోకుండా మాటమార్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమిగారి అనిల్, యాట భిక్షపతి, రామగల్ల చింటు తదితరులు పాల్గొన్నారు.

మేథో సంపత్తి హక్కులపై అవగాహన

ములుగు, ఏప్రిల్ 1: మేథో సంపత్తి హక్కులు ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తాయని ప్రముఖ రిసోర్స్ పర్సన్ అశోక్ అన్నారు. సోమవారం ములుగులోని అటవీ కళాశాలలో విద్యార్థులకు మేథోసంపత్తి హక్కుల పై అవగాహన కలిపించారు. కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ టీఎస్‌సీఓఎస్‌టీ ఈఎఫ్ఎస్, టీ విభాగం ప్రభుత్వం స్పాన్సర్ చేసిందని తెలిపారు.

నవోదయ ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు

వర్గల్, ఏప్రిల్ 1 : వర్గల్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీ అయిన 8 సీట్ల భర్తీకి గాను ఎంపికైన విద్యార్థుల జాబితాను సోమవారం విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్ వెల్లడించారు. గాండ్ల శ్రీఖర్ (323873), అల్లన్‌కి నేహ (323970), దమ్మనగారి హేమచంద్ర (323675), వడ్ల కౌశిక్ చారి (323945), గొల్ల భాను (323842), మద్దురి హర్షశ్రీ (323601), మల్కె మధులత (323387), స్వప్నిక (323236) ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశానికి గాను వర్గల్ మండలం నెంటూర్ శ్రీ హర్ష టాలెంట్ స్కూల్ విద్యార్థి గోయికారి నిఖిల్ ఎంపికైయ్యాడు. గోయికారి నిఖిల్ ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజనేయులు, అధ్యాపక బృందం నిఖిల్‌తో పాటు అతని తల్లిదండ్రులు నరేశ్, లావణ్యలను అభినందించారు. అలాగే వర్గల్ మండల కేంద్రానికి చెందిన కిష్టనోల్ల సుశీల్‌కుమార్ నవోదయకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు సుశీల్‌కుమార్‌తో పాటు అతని తల్లిదండ్రులు స్వామి, మనీలను అభినందించారు.


త్వరలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు

● జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజు

అగ్రికల్చర్, ఏప్రిల్ 1: పొద్దుతిరుగుడు కేంద్రాలు మరో మూడు రోజుల్లో తిరిగి ప్రారంభిస్తామని, పొద్దుతిరుగుడు పంటను సాగు చేసిన రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మరో రెండు వేల క్వింటాళ్లతోపాటు అదనంగా పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేసేందుకు అనుమతి వచ్చిందని ఆయన తెలిపారు.

కొనుగోలు కోటా విడుదల చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వం పొద్దుతిరుగుడు కొనుగోలు కోటాను విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కోట విడుదల చేసి, పొద్దుతిరుగుడు కొనాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట మార్కెట్ యార్డులో నిరసన తెలుపుతున్న రైతులకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం


రైతులతో కలిసి మాట్లాడుతున్న నాయకులు

తెలిపారు. అనంతరం రైతులతో కలిసి వారు మాట్లాడారు. మార్కెట్ యార్డుకు తీసుకువచ్చిన పొద్దుతిరుగుడు కొనుగోలు చేయకపోవడంతో ఇక్కడే పడిగాపులు కాయాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ కోటా విడుదల చేసి పొద్దుతిరుగుడు కొనేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రైతుల పక్షాన నిలబడి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని వారు హెచ్చరించారు.